క్లుప్తంగా

విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి పంపిణీ



విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందజేస్తున్న సర్పంచ్ భాగ్యవతి, ప్రసన్నకుమార్

ముంచంగిపుట్టు: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల, బాలుర పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, పరీక్ష అట్టలను శుక్రవారం జర్రెల సర్పంచ్ నాయకం భాగ్యవతి, వర్తక సంఘం అధ్యక్షుడు ప్రసన్నకుమార్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు సాధించాలని, ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. సర్పంచ్ నోబిన, హెచ్‌ఎం లక్ష్మీ, ఉపాధ్యాయులు సత్యరావు, రత్నాలమ్మ, శకుంతల, నేతలు నానిబాబు, తిరుపతిరావు, రాజారావు, వైకుంఠరావు, పూర్ణారావు పాల్గొన్నారు.

బంద్‌పై ప్రచారం

ముంచంగిపుట్టు: రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌ను ఆదివారం నిర్వహించనున్న బంద్‌పై గిరిజన సంఘం నేతలు శుక్రవారం మండల కేంద్రంలో ప్రచారం చేశారు. బంద్‌ను విజయవంతం చేయాలని సంఘంనేత శ్రీను కోరారు. జీవో నెంబర్-3 పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

అనారోగ్యంతో శిశువు మృతి



మృతి చెందిన శిశువు

జి.మాడుగుల: మండలంలో కుంబిడిసింగి పంచాయతీ ఉర్లమెట్ట గ్రామానికి చెందిన మగశిశువు అనారోగ్యంతో గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. కుంబిడిసింగి పంచాయతీ ఉర్లమెట్ట గ్రామానికి చెందిన 3 నెలల వయస్సు గల మగ శిశువు అనారోగ్య బారిన పడడంతో పాడేరు ఆస్పత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. వైద్యుల సిఫార్సు మేరకు మెరుగైన వైద్య నిమిత్తం విశాఖ కెజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు తల్లిదండ్రులు ప్రశాంత్‌కుమార్, కుమారి తెలిపారు.

చిన్నారి వైద్యానికి సాయం



చికిత్స అనంతరం కోలుకున్న చిన్నారి

గూడెంకొత్తవీధి: మండలంలోని కుమ్మరవీధి గ్రామానికి చెందిన గిరిజన దంపతులు గెమ్మెలి గంగరాజు శైలుకు జన్మించిన నాలుగేళ్ల కుమార్తె శ్రీనిధి కొద్దిరోజులుగా అస్వస్థతతో బాధపడుతుంది. వైద్యం కోసం ఎదురు చూస్తున్న విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి మల్లేష్ గ్రామానికి వెళ్లి చిన్నారిని వైద్యానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. తల్లిదండ్రులతోపాటు చిన్నారిని నర్సీపట్నంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించారు. దీంతో ఆ చిన్నారి కోలుకుంది. తన కుమార్తెకు వైద్యం అందించిన హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులను చిన్నారి తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

శ్రమదానంతో జంగిల్ క్లియరెన్స్



జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న యువకులు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రానికి వెళ్లే మార్గంలో శుక్రవారం జంగిల్ క్లియరెన్స్ చేశారు. రహదారికి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కల వల్ల వాహనచోదకులు ఇబ్బందులు పడుతుండడంతో గిద్దులపుట్టు, మర్రిపుట్టు గ్రామాల యువకులు శ్రమదానంతో జంగిల్ క్లియరెన్స్ చేశారు. యువకుల స్పందనపై స్థానికులు, వాహనచోదకులు హర్షం వ్యక్తం చేశారు.



కొయ్యూరు మల్లికార్జున ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు





చినఏటిపల్లి ఉమారామలింగేశ్వర స్వామి ఆలయం, జడ్డంగిలోని భ్రమరాంభికా మల్లికార్జునస్వామి ఆలయాల వద్ద బారులు తీరిన భక్తులు

హర హర మహాదేవ

- భక్తులతో కళకళలాడిన శైవక్షేత్రాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- మార్మోగిన శివనామస్మరణ



మత్స్యలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అరకు సమన్వయకర్త రేగం మత్స్యలింగం



అంతర్లలో పూజలు చేస్తున్న పాడేరు సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు



కుమారస్వామి గుట్టపై సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెదబయలు: మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తులు శుక్రవారం నియమనిష్టలతో శుక్రవారం ఘనంగా జరుపుకొన్నారు. శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. మహాశివునికి పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు తెల్లవారుజామునే నదీ జలాల్లో పుణ్యస్నానాలాచరించారు. అనంతరం శైవక్షేత్రాలు, శివాలయాలకు వెళ్లి శివపార్వతులను దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. నందీశ్వరునికి పూజలు జరిపారు. భారీ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాలు శివనామస్మరణతో మార్మోగాయి. శివరాత్రి పురస్కరించుకొని రాత్రి జాగరణకు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో జాతరలు నిర్వహించారు. భజనలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

నీలకంఠేశ్వరస్వామి వారికి పల్లకి సేవ

పెదబయలు మండలం అరడకోటలో నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో జరిగిన వేడుకలో స్వామి వారికి పల్లకిలో ఊరేగించారు. కిముడుపల్లిలోని పురాతన శివకేశవ స్వాముల వారి ఆలయం, పెదబయలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుంచివాడలో రాత్రి జాతర జరిగింది.

ముంచంగిపుట్టు/జీకేవీధి/కొయ్యూరు/సీలేరు/జి. మాడుగుల: ముంచంగిపుట్టు, గూడెం కొత్తవీధి, కొయ్యూరు, జి.మాడుగుల మండలాల్లోని శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. పెదబయలు మండలం ఎర్రబయలు గ్రామం వద్ద నిర్వహిస్తున్న శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను జి.మాడుగుల సీఐ రమేష్ పర్యవేక్షించారు.



పొల్లూరు దుర్గ మల్లేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

గ్రామాల్లో తిరునాళ్లు

గంగవరం/రాజవొమ్మంగి/వై.రామవరం/ఎటపాక/అడ్డతీగల/చింతూరు/కూనవరం/మోతుగూడెం/మారేడుమిల్లి: గంగవరం మండలం చినఏటిపల్లిలో రాత్రి శాంతి కల్యాణం నిర్వహించారు. రాజవొమ్మంగి శివాలయంలో సాయంత్రం శివపార్వతుల కల్యాణ వేడుక కనులపండువగా జరిగింది. మడేరులోని గుహలో ఉన్న భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు మోకాళ్లపై వెళ్లి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ నాలుగు రోజులపాటు జరిగే జాతరకు వేలాదిగా జనం తరలివచ్చారు. వై.రామవరం మండలంలోని పూతిగుంట పరమేశ్వరుని ఆలయంతో పాటు గురమండలో స్వయంభూగా వెలసిన విశ్వనాథుని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఎటపాక మండలంలోని గొల్లగూడెం, గన్నవరం, బుట్టాయిగూడెం, నెల్లిపాక, వెంకటరెడ్డిపేటలోని శివాలయాల్లో శివపార్వతుల కల్యాణం కనులపండువగా జరిగింది. అడ్డతీగల మండలంలోని పవనగిరి క్షేత్రంతో పాటు పలు శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చింతూరు మండలంలోని చట్టిలో స్వయంభూ గాదె రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. కూనవరం మండల కేంద్రంతో కుమారస్వామి గుట్టపై శైవ క్షేత్రాలు భక్తులతో కళకళలాడాయి. ఆలయంలో కల్యాణ వేడుక కనులపండువగా జరిగింది. ఇక్కడ తిరునాళ్ల సందడి జరిగింది. మోతుగూడెం మండలం పొల్లూరు గ్రామంలో శైవక్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మారేడుమిల్లి మండల కేంద్రంతో పాటు పాతవాడలంక స్వయంభూగా వెలసిన కుండలేశ్వర స్వామి ఆలయాల్లో అభిషేకాలు, హోమాలు జరిపారు.



గ్రామస్తులకు సూచనలిస్తున్న సీఐ రమేష్



అరడకోట ఆలయంలో భక్తుల కిటకిట



పాతవాడలంక శివాలయంలో అభిషేకాలు చేస్తున్న పూజారులు



పవనగిరి క్షేత్రంలో అమరవల్లభేశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు



జీకే వీధి శివాలయంలో భక్తుల పూజలు



సీలేరులో శివాలయంలో భక్తులు



గురమందలో విశ్వనాథుని ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బుట్టాయిగూడెంలో పూజలు చేస్తున్న భక్తులు



చట్టిలో శివలింగాన్ని దర్శిస్తున్న భక్తులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఘనంగా మహిళా దినోత్సవం



హుకుంపేటలో ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలను సన్మానిస్తున్న అరకు సమన్వయకర్త రేగం మత్స్యలింగం

హుకుంపేట: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో జరిగిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో సీడీపీవో బాలచంద్రమణిదేవితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందిని అరకు నియోజకవర్గ సమన్వయకర్త రేగం మత్స్యలింగం సన్మానించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు చేస్తున్న సేవలను కొనియాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: మండలంలోని అంతర్ల, కిన్నెర్ల గ్రామాల్లో పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు శుక్రవారం పర్యటించారు. గ్రామాల్లో మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతు మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారావు, మాజీ సర్పంచ్ రాంబాబు, నాయకులు సుధాకర్, కొత్తన్న దొర, సోమరాజు, రాంబాబు, సచివాలయ కన్వీనర్ కృష్ణ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఆదివాసీ మహిళ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బాబుశాల పంచాయతీ గాజులబంధలో మ్యాజిక్ బస్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

కొయ్యూరు: మర్రిపాలెం మహిళా కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ, కవిత పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఎస్.కె.హారూన్, వైస్ ప్రిన్సిపాల్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. శాంతిపాప, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కిన్నెర్లలో మాట్లాడుతున్న పాడేరు సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు



ముంచంగిపుట్టులో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



రాజవొమ్మంగిలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళలు

చింతూరు: స్థానిక ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సుజాత, తులసి, కవిత, సీత, మీనా, లక్ష్మి పాల్గొన్నారు.

రంపచోడవరం: ఇర్లపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అలర్లు సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బందం శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని, మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. ఎంపీపీ శ్రీదేవిని, పలువురు మహిళలను సన్మానించారు. న్యాయవాదులు ఎ.వి.సత్యనారాయణ, శివరంజని, ఆదివాసీ మహాసభ కార్యదర్శి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలురు పాఠశాలలో జరిగిన వేడుకలో హెచ్‌ఎం సత్యవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మర్రిపాలెంలో విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న ప్రిన్సిపాల్ హారూన్



చింతూరు ఏరియా ఆస్పత్రి వద్ద పండ్లు అందజేస్తున్న మహిళా ఉపాధ్యాయులు



రంపచోడవరం ఎంపీపీ శ్రీదేవిని సన్మానిస్తున్న మహిళలు



కింద్రలో ఎంపీపీ వెంకటలక్ష్మిని సన్మానిస్తున్న డ్వాక్రా మహిళలు

ఎటపాక: స్థానిక గుండాలకాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో సీనియర్ మహిళలను సన్మానించారు. పద్మ, రమణ, సావిత్రమ్మ, వెంకట నర్సమ్మ, రజిని తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: కింద్రలో జరిగిన వేడుకలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మిని డ్వాక్రా మహిళలు సన్మానించారు. రత్నం, నూకాలమ్మ, పార్వతి, మంగతాయారు, రాజేశ్వరి, అమ్మాజి, కాశీ పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం



బొర్రాలోని ర్యాలీ చేపడుతున్న సమన్వయకర్త రేగం మత్స్యలింగం, నాయకులు, కార్యకర్తలు

అనంతగిరి: జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు సిద్ధంగా ఉన్నారని, అరకు సమన్వయకర్త రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని బొర్రా పంచాయతీలోని ఆయన శుక్రవారం పర్యటించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ చేపట్టారు.. వన్స్‌మోర్ జగనన్న అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రేగం మత్స్యలింగం మాట్లాడుతూ ఐదేళ్లల్లోనే జగనన్న ఈ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధిచేశారన్నారు. అనంతరం నందీశ్వరుడు ఆలయంలోని ప్రత్యేక పూజలుచేసి, లంగుపర్తి పంచాయతీలోని కార్యక్రమంలో పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, వైస్ ఎంపీపీ దూరు జయవర్ధిణి, ఎంపీటీసీ అరుణ, జేసీఎస్ కన్వీనర్ నవీన్, ప్రధాన కార్యదర్శులు గంగులు, శెట్టిలక్ష్మణరావు, దానియేలు, ఉపాధ్యక్షుడు మధుసూదన్, సూర్యనారాయణ, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి గంగరాజు, సర్పంచులు సన్యాసిరావు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.



గత్తుంలో కన్వీనర్లు, గృహసారథులతో పార్టీ శ్రేణులు

హుకుంపేట: వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు, కన్వీనర్లు, గృహసారథులు పనిచేయాలని మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామకృష్ణ చెప్పారు. మేము సిద్ధం..మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని భూర్జ, గత్తుం పంచాయతీల్లో నాయకులు, కన్వీనర్లు, గృహసారథులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎంపిటీసీ సభ్యురాలు మజ్జ హరి, జన్ని సింహాచలం, రాజారావు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

11న బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ఎటపాక: బాల్యవివాహాల నిర్మూలనపై ఈనెల 11న మండల స్థాయిలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్త్రీ శిశుసంక్షేమశాఖ ఎటపాక సీడీపీఓ విజయగౌరి తెలిపారు. ఎటపాకలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు ప్రారంభమవుతుందన్నారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మండల కమిటీ సభ్యులు సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

ఘనంగా ఆరాధన మహోత్సవం


అనకాపల్లి : విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఊరేగింపు రథాన్ని భక్తులు ప్రారంభించారు. ప్రతి ఏడాది మహా శివరాత్రి రోజు స్వామివారి రథం ఊరేగింపు ఉంటుందన్నారు. రాత్రి 8 గంటలకు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు.

శరవేగంగా రహదారుల పనులు

అనంతగిరి: మండలంలోని పినకోట పంచాయతీ పినకోట-గడ్డిబంధ, బోనూరు-పి.గంగవరం వరకు రూ.17.39కోట్లతో రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకులు కనీసం రహదారి సౌకర్యం కల్పించకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డోలీమోతలే వారికి దిక్కుగా ఉండేవి. ఆ పరిస్థితుల నుంచి విముక్తి కలిగించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు వచ్చింది. గ్రామాల్లోనూ రహదారుల నిర్మాణం కోసం జగనన్న ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. బొర్రపాలెం, చటకంభ, బోనూరు, చీడిమెట్ట, మెట్టవలస, గడ్డిబంధ, జగడల మామిడి, పుతికపుట్టు, తంగెలబంధ, పి.గంగవరం తదితర గ్రామాలకు రహదారుల పనులు జరుగుతుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యత ప్రమాణాలతో పనులు

బోనూరు రోడ్డు పనులను ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వేణుగోపాలరావు, డీఈఈ సుబ్బారావు పరిశీలించి, నాణ్యత ప్రమాణాలతో తారురోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఆయా గ్రామస్తులను కలిసి రోడ్డు పనులపై అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని, ఏఈ గణేష్‌కు ఆదేశించారు. నెలరోజుల్లో తారురోడ్డు పనులన్నీ పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు.



రోడ్డు పనుల వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న ఈఈ వేణుగోపాలరావు